## మినీకథ

# వళ్ళు బరువు

వసుంధర



ఫలానా అని చెప్పలేనుగానీ, ఈ మధ్య వంట్లో నాకదోలాగుంటోంది నాలుగు రోజులు చూసి డాక్టర్ దగ్గరకు వెళ్ళాను. డాక్టరు నన్ను రకరకాలుగా పరీక్షచేసి "మీలో పెద్దగా లోపాలేమి లేవు ఎటొచ్చీ బరువు కాస్త తగ్గాలి " అన్నాడు

"ఏం చేయమంటారు?" అనడిగాను.

"ఆహారం మితంగా తీసుకోండి. కాస్త శరీర వ్యాయామం చేయండి. వీలైనంత వరకూ ఎక్కడికైనా నడిచే వెడుతూండండి" అన్నాడు డాక్టరు

నేను అతిగా తింటానని అనుకోను. ప్రస్తుతం తినేదానిని తగ్గించడం నా వల్ల కాదు. ఇంట్లో కూర్చుని చదువుకోవడమో, రాయడమో చేయగలను కానీ శరీర వ్యాయామం చేసే ఓపిక నాకు లేదు. చిన్నప్పట్నించీ లేని అలవాటు హఠాత్తుగా ముప్పై ఏ అయిదేళ్ళ దాటేక చేసుకోవడం నావల్ల కాదు. నావల్ల అయ్యేదల్లా నడక ఒక్కటి మాత్రం, ఇది నాకు తప్పనిసరి కూడా! ఎందుకంటే రెండు చక్రాల బళ్ళేవీ నేను ఎక్కి తొక్కలేదు నాలుగు చక్రాలబళ్ళు మెయింటెయిన్ చేసే స్తోమత లేదు.

గవర్నమెంటు ఉద్యోగం చేసే వాళ్ళకు వళ్ళు బరువుంటుందట. అందుకని ఏదైనా ప్రయివేటు కంపెనీలో చేరమని కొందరు దగ్గరి బంధువులు మేలమాడారు. కదల లేని స్థితి వస్తే చక్రాల మంచం మీదైనా ఆఫీసుకి వెడతాను గానీ చూస్తూ చూస్తూ గవర్నమెంటు ఉద్యోగం వదులుకోలేను

నేను పనిచేసే ఆఫీసు చుట్టూ క్వార్టర్సున్నాయి. అందులో నాకూ స్థానం దొరికింది. ఆఫీసుకి నడక అయిదు నిముషాల లోపే! ఉదయం తొమ్మిదింటికి ఆఫీసుకి చేరుకోవాలి. నేను టిఫిన్ తిని ఆఫీసుకు బయల్దేరే వేళకు వొళ్ళు బరువెక్కుతుంది. అప్పుడా అయిదు నిముషాల నడకా బాగానే వుంటుంది. అయితే యిక్కడో యిబ్బంది వుంది

ఆఫీసులో అందరికీ ఇంచు మించు స్కూటర్లున్నాయి. వారంతా కూడా స్కూటర్ల మీదే ఆఫీసుకు వస్తూంటారు. నడిచి ఆఫీసుకు వెళ్ళేవారందరికీ క్వార్టరు వదిలి నాలుగడుగులు వేసేసరికి లిఫ్ట్ దొరుకుతూంటుంది. లిఫ్ట్ కావాలని ఎవరూ అడగక్కరలేదు. నడిచే మనిషి కనబడగానే వాళ్ళే స్కూటర్ ఆపి- హారన్ కొట్టి "కమాన్ యార్" అంటారు.

ఈ లిఫ్ట్ ఉపయోగించుకోకూడదని నేను అనుకున్నాను, అయితే ఈ నిర్ణయం తీసుకున్న మొదటి రోజునే ఎనమండుగురు స్కూటర్ వాళ్ళను ఇబ్బందిపెట్ట వలసివచ్చింది. వాళ్ళు నా గురించి స్కూటరు ఆగడం - ఇది నా మనసుకంతగా నచ్చుబాటు కాలేదు

అడిగి లిఫ్ట్ ఇస్తూంటే కాదంటే అవతలి వాళ్ళు చాలా ఫీలవుతారు. ఒక రోజైతే ఏదో వంక పెట్టవచ్చు. రోజూ అలా చేస్తే బాగుండదుకదా! అప్పటికీ మర్నాడు తెగించి "నాకు వళ్ళు బరువు- నన్ను నడిచే వెళ్ళనివ్వండి" అన్నాను

స్కూటరు ఆపడం — నేను దారిలో ఏదో పని వుందని చెప్పడం (వళ్ళు బరువని చెప్పుకోడానికి సిగ్గుకదా!) - ఒక స్కూటర్ నన్ను దాటి వెళ్ళిన కొద్ది క్షణాలకే మరో

జోకుగా అన్నట్లు- మొదట స్కూటరాపినతన్ని చూసి

అతనదోలా ముఖంపెట్టి "నామీదేం జోకు వేయక్కర్లేదు. స్కూటరెక్కండి" అన్నాడు.

అప్పుడే నాకు స్ఫురించింది- అతను నాకంటే లావు అని అతనే కాదు-

స్కూటర్ల మీద వెళ్ళే చాలా మంది నాకంటె పుష్టిగా వున్నారు అందుకు వాళ్ళ స్కూటరే కారణమయుండొచ్చు.

మారు మాట్లాడకుండా స్కూటరెక్కేను.

ఈ స్కూటర్ల మొహమాటాన్నెలా తప్పించుకోవాలా అని తీవ్రంగా ఆలోచించగా ఒక విషయం స్ఫురించింది. మా ఆఫీసు తొమ్మిదింటికి అయితే గవర్నమెంటాఫీసు కావడంవల్ల ఎవ్వరూ తొమ్మిదింటి' రారు. తొమ్మిదింపావు ప్రాంతాల మా రోడ్లు చాలా రద్దీగా ఉంటుంది కాబట్టి నేను మరికాస్త ఆలస్యంగా బయల్దేరితే సరిపోతుంది. ఇలా అనుకుని ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళడం ప్రారంభించాను

ఈ విధంగా తొమ్మిదింపావు నించి పది మధ్యలో అన్ని సమయాల్లోనూ ప్రయత్నించాను. కానీ ఈ సమయంలో కూడా ఏవో స్కూటర్లు వస్తున్నాయి. ఆమాటకొస్తే పది తర్వాత కూడా కొన్ని స్కూటర్లొస్తున్నాయి. ఇందులో ఆశ్చర్యమేమీ లేదు. ఆఫీసుకు ఎంత ఆలస్యంగావచ్చినా అడిగేవాళ్ళు లేరు.

అయినా ఈ విషయంలో వాళ్ళను తప్పుపట్టే అర్హత నాకూ లేదు. అవును మరి, ఓ కారణంవల్ల నేను ఆలస్యం చేస్తూంటే మరో కారణంవల్ల వాళ్ళు ఆలస్యం చేస్తూండవచ్చు. నన్నూ అడిగే వాళ్ళు లేరు. వాళ్ళనూ అడిగేవాళ్ళు లేరు.

అప్పుడు నాకు అసలు పరిష్కారం స్ఫురించింది. నిజంగా మనస్ఫూర్తిగా నేను స్కూటర్ల మొహమాటాన్నుంచి తప్పించుకోవాలంటే అందుకు ఒకే ఒక్క ఉపాయముంది. అదే ఆఫీసుకి టైముకి వెళ్ళడం। అలా వెళ్ళాలంటే ఇంటి దగ్గర అయిదు నిముషాలు తక్కువ తొమ్మిదికల్లా బయల్దేరాలి.

ఆ ప్రకారం ఒక రోజు వెళ్ళాను. ఒక్క స్కూటర్ కూడా రాలేదు. అంతే కాదు, దారి నిర్మానుష్యంగా వుంది. ఎంత నిర్మానుష్యంగా వుందంటే- ఎవరైనా నన్నా సమయంలో హత్యచేసి ఎవరికంటా పడకుండా పారిపోవచ్చు. ఈ ఆలోచన కలిగి ఒక్క పిసరు భయంకూడా వేసింది.

ఏమైతేనేం నా సమస్యకు పరిష్కారం దొరికింది. రోజూ యిలా చేస్తే ఏ బాధా వుండదనిపించింది.

మర్నాడు కూడా అలాగే వెళ్ళాలనుకున్నాను గానీ తెమల్లేకపోయాను. మరి లిఫ్టు తప్పలేదు.

ఆ మర్నాడూ అలాగే జరిగింది.

అంతేకాదు— ఆ తర్వాతనుంచి ప్రతీ రోజూ అలాగే అవుతోంది

సాధారణంగా నేను ఆఫీసుకి తొమ్మిదీ అయిదు నిముషాలకు బయల్దేరతాను. ఇంకొక్క పదినిముషాలు ముందుగా ఎందుకు తెమల్లేకపోతున్నాను ?.... పట్టుదల వచ్చి కాస్త ముందుగా నిద్రలేవడం మొదలెట్టాను. ఎంత పెందరాళే లేచినా తెమిలేసరికి తొమ్మిదీ అయిదు అయిపోతోంది

నన్ను నేనే విమర్శించుకుని గ్రహించిన దేమిటంటే – ఆఫీసుకు టైముకి వెళ్ళడం నాకు కష్టమేమి కాదు. కానీ అందుకు నాకు మనసొప్పడం లేదు! అదీ కాక పనేళ్ళుగా అయిన అలవాటిది నాకు. ఏ ఎమర్జన్సీలూ లేకుండా ఈ అలవాటెలా పోతుంది ?

అయినా నాకంటే వళ్ళు బరువు మనుషులు స్కూటర్ల మీద పోతున్నప్పుడు నేను మాత్రం వళ్ళు బరువు గురించి పట్టించుకోవడమెందుకూ – అని కూడా నాకు అనిపించింది.

ఆఫీసుకు నడిచే వెళ్ళితీరాలన్న పట్టుదల వదులుకున్నాను. ★




# జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా

బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్
మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.

ఉచితం!

మీ సొంత శైలిని రూపొందించుకోండి.
"హౌ టు లుక్ స్మార్ట్ అండ్ ఫీల్ కాన్ఫిడెంట్" అన్న
మా చిన్న పుస్తకం కోసం వ్రాయండి. జాడీ మూత లోపలి కార్కుతోపాటు
50 పైసల స్టాంపు జతపరిచి, ఈ క్రింది చిరునామాకు పంపండి.
హెచ్. ఎమ్. ఎమ్. లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ AJW, 1 జైసింగ్ రోడ్, న్యూ ఢిల్లీ-110001
పుస్తకం అందేందుకు, దయచేసి 4 వారాలు వ్యవధి ఇవ్వండి.




OBM/5829Tel